రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో పనిచేస్తున్న జంతుశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ పి.శచిదేవికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సలీంబాష, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. గురువారం కళాశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శచీదేవి జంతుశాస్త్ర బోధనతో పాటు కళాశాలలో ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కళాశాలలో ప్రత్యేక గుర్తింపు పొందారని చెప్పారు. సన్మాన గ్రహీత శచీదేవి మాట్లాడుతూ అవార్డు రావడానికి కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు తోటి అధ్యాపకులు, విద్యార్థులు సహాయ సహకారాలు ఎంతగాను ఉపయోగపడ్డాయని తెలిపారు. అవార్డు కళాశాలకు అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల సాగు ప్రశ్నార్థకం

- కెసి పరిధిలో వరి సాగుకు విరామం తప్పనిసరి
- నీటి వాటా ఇవ్వడంలో తీవ్ర జాప్యం
- రాజోలి ఏర్పాటులోనూ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-చాపాడు

సెప్టెంబర్ మెదటి వారం పూర్తి కావస్తున్నా కెసి కెనాల్ ఆయకట్టు పరిధికి నీరు విడుదల కాకపోవడంతో ఖరీఫ్‌లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారినది. కర్ణాటక, మహారాష్ట్రలలో సకాలంలో వర్షాలు పడకపోవడంతో శ్రీశైలం ప్రాజెక్టులో నీరు ఇప్పటికి పూర్తి స్థాయికి నోచుకోలేదు. స్థానికంగా రాజోళి ఆనకట్ట వద్ద నీరు ఉన్నా ఖరీఫ్‌కు సరిపోవన్న కారణంతో కాలువకు నీరు విడుదల చేయలేదు. ప్రస్తుతం రాజోలి ఆనకట్ట ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడటంతో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. వేలాది క్యూసెక్కుల నీరు వృథాగా సోమశిలకు వెలుతున్నా కెసికి నీరు ఇవ్వడంలో పాలకుల, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రాజోలి ఆనకట్ట పెంపుపై నిర్లక్ష్యం కొనసాగుతుండటంతో ఏళ్ళు గడుస్తున్నా నిర్మాణం ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం కెసి పరిధిలో పచ్చని పైరుతో ఉండాల్సిన సందర్భంలో ఎడారిని తలపించే బీడు భూములు దర్శనిమిస్తున్నాయి.

రాజోలి ఏర్పాటులో నిర్లక్ష్యం...

జిల్లాలోని లక్షలాది మంది రైతుల గుండె సవ్వడి ప్రవాహమే కెసి కెనాల్. జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తున్న ఒక పెద్ద ప్రాజెక్టు. రాజోలి ఆనకట్ట, కెసి కాలువ ద్వారా జిల్లాలోని రాజుపాలెం, దువ్వూరు, ప్రొద్దుటూరు, చాపాడు, మైదుకూరు, ఖాజీపేట, వల్లూరు, చెన్నూరు, కడప మండలాల్లో 92 వేల ఎకరాలలో సాగు భూమి ఉంది. ప్రస్తుతం వరి, పసుపు, వేరుశనగ, పొద్దు తిరుగుడు, మినుము ఇతర పంటలను దేశానికి ఎగుమతి చేసే దిశగా కెసి కెనాల్ ప్రాంత రైతులు ఉన్నారు. కెసి కెనాల్‌కు ప్రతి సంవత్సరం నీరు వస్తుందా లేదా అని సందిగ్ధంలో రైతులు ఉంటున్నారు. 2019 డిసెంబర్ 23న ముఖ్యమంత్రి జగన్ రాజోలి ఆనకట్టను 2.95 టిఎంసిల సామర్థ్యంతో సుమారుగా రూ.800 కోట్లకు పైగా నిధులు వెచ్చించి నిర్మించే ప్రాజెక్టు భూమిపూజ చేశారు. నాలగేళ్లు పూర్తి కావస్తున్నప్పటికీకి పురోగతి లేదు. వర్షపు నీరు నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడంతో కుందూ వరద నీరు పెన్నా ద్వారా సోమశిల ప్రాజెక్టులోకి ప్రతి ఏడాది లక్షల క్యూసెక్కుల నీరు తరలివెళుతోంది. రాజోలు ఆనకట్ట పెంపుదల చేస్తే ఈ నీటిని నిల్వ ఉంచి కెసి కెనాల్‌కు మళ్లించడం ద్వారా రైతులు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.

కెసికి వాటా ఇవ్వడంలో జాప్యం..

శ్రీశైలంలో నీటిమట్టం 854 అడుగులకు చేరగానే కెసి కాలువకు నీరు విడుదల చేయాలని జిఒ చేశారు. ప్రస్తుతం 884 అడుగులకు నీరు చేరితే మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు. 854 అడుగుల జిఒ అమలుకు నోచుకోకపోవడంతో కెసి కాలువకు నీరు చేరే పరిస్థితి లేదు. నీరు విడుదల అయినప్పటికీ అవి ఎప్పటి వరకు వస్తాయనేది అధికారులకే తెలియని పరిస్థితి. ఒకవేళ విడుదల చేసినా సెప్టెంబర్, జనవరి మధ్యలో విడుదల చేస్తున్నారు. ఆగస్టు నుంచి ఏప్రిల్ చివరి వరకు విడుదల చేస్తే రెండు దఫాలుగా పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలో కెసి కాలువ కింద ఖరీఫ్, రబీలలో రెండు సార్లు పంటలు పండించుకునే రైతులు సస్యశ్యామలంగా ఉండాలంటే రాజోలి ఆనకట్ట ఎత్తు పెంపు వీలైనంత త్వరగా నిర్మించాల్సి ఉంది. లేనిపక్షంలో కెసి కాలువకు సకాలంలో నీరు రావడం ప్రశ్నార్థకంగా మారే అవకాశం లేకపోలేదు.

జిల్లా వ్యాప్తంగా తగ్గిన సాగు..

కడప జిల్లాలోని 36 మండలాల్లో వార్షిక వర్షపాతం 699 మిల్లీమీటర్లు కాగా నైరుతి రుతుపవరాల సాధారణ వర్షపాతం 403.3 మిల్లీ మీటర్లు. ఇప్పటి వరకు వర్షపాతం 156.2 మీ.మీ. గాను 108.2 మీ.మీ వర్షపాతం నమోదైంది. 30.5 శాతం తక్కువగా నమోదైనది. జిల్లాలో పంటల విస్తీర్ణం ఖరీఫ్ సీజన్‌లో 2023 వివిధ రకాల పంటల సాధారణ విస్తీర్ణం 77,128 హెక్టార్లు కాగా ఇందులో 11,465 హెక్టార్లు మాత్రమే వివిధ పంటల సాగు చేసినట్లు తెలుస్తుంది.

వరిసాగుపై ఆసక్తి ఉన్నా లేని అవకాశం..

గత ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన వరి ధాన్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ధరలు రోజు రోజుకు పెరుగుతూ పుట్టి (బస్తాలు) రూ.23 వేలకు చేరుకున్నాయి. డిసెంబర్ నెలలో వరి నూర్పిడి పనులు చేపట్టిన సమయంలో పుట్టి(8 బస్తాల) ధర రూ.12 వేల వరకు పలికాయి. ఆ తర్వాత జనవరిలో రూ.13 వేలకు ధరలు చేరుకున్నాయి. ప్రస్తుతం రూ.21 వేల వరకు చేరుకున్నాయి. గత ఏడాది సాగైన వరి ధాన్యం రూ.23 వేల వరకు పలికాయి. ఈ ఏడాది వరి సాగుకు ఆసక్తి కనపరుస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో సాధారణంగా కెసి, కుందూ, బ్రహ్మసాగర్, మైలవరం, గండికోట, పలు చెరువుల కింద వరి పంటను అత్యధికంగా సాగు చేసేవారు. రెండు లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను సాగు చేసేవారు. గత ఏడాది 50 వేల ఎకరాల వరకు సాగు తగ్గడానికి సరైన మద్దతు ధరలేకపోవడమే. ఈ ఏడాది సాగు చేపడదామనుకున్న తరుణంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు పూర్తిగా తగ్గింది.

వరి సాగుకు ఏర్పాట్లు చేసుకున్నాం

పది ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి పంట సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నాను. పచ్చిరొట్ట ఎరువులు సాగు చేపట్టి విత్తన వడ్లు కూడా కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నాం. కెసి కాలువకు నీరు రాకపోవడంతో ప్రస్తుతం జీలగ పంటను తొలగించి ఆరు తడి పంటల సాగుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు ఎకరాకు దుక్కిళ్ళు, విత్తన సాగుకు రూ.3వేలు ఖర్చులొచ్చాయి.

- భాస్కర్‌రెడ్డి, విశ్వనాథాపురం, చాపాడు.

కెసి రైతులను ఆదుకోవాలి

కెసి పరిధిలోని రైతులు వరి పంటకు అవసరమైన ఏర్పాట్లు చేసుకొని ప్రస్తుతం నీరు విడుదల కాకపోవడంతో జీలగ పంటను దుక్కిళ్ళు చేపడుతున్నారు. రాజోలి ఆనకట్ట నిర్మాణం చేపట్టకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం వల్లే కెసి రైతులకు ఇలాంటి దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం కుందూలో వర్షపు నీరు వృథాగా సోమశిలకు వెలుతుంది తప్ప కడప జిల్లా ప్రజలకు ఏమాత్రం మేలు జరగడం లేదు. వరి సాగుకు ఏర్పాట్లు చేసుకోని నష్ట పోయిన రైతులకు ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలి.

- జి.శివకుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు.

స్టాఫ్ నర్స్ పోస్టులకు కౌన్సెలింగ్!

ఆగస్టు 31తో ముగిసిన కాలపరిమితి
నోటిఫికేషన్ నిబంధనలు బేఖాతర్
36 పోస్టుల నియామకాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

స్టాఫ్‌నర్స్ పోస్టుల కౌన్సెలింగ్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల తొమ్మిదిన కౌన్సెలింగ్ నిర్వహణకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం ఏర్పాట్లు పూర్తి చేసింది. జోన్-4 పరిధిలోని ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల పరిధిలో 36 స్టాఫ్ నర్స్ పోస్టులతో కూడిన కౌన్సెలింగ్ జాబితాను రూపొందించింది. ప్రభుత్వం 2022 ఆగస్టులో 300 మంది స్టాఫ్‌నర్స్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆర్‌డి కార్యాలయ యంత్రాంగం కౌన్సెలింగ్ నిర్వహించింది. ప్రభుత్వం రెండు నెల కిందట అదనంగా మరో 313 మంది స్టాఫ్‌నర్స్ పోస్టులకు రిక్రూట్‌మెంట్ ప్రకటన విడుదల చేసింది. కడపలోని ఓ కల్యాణ మండపంలో ఆర్‌డి కార్యాలయం కౌన్సెలింగ్ నిర్వహించింది. ఇందులోని నాన్ జాయినింగ్ పోస్టులకు నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం ఏడాది వ్యవధిలోపు ప్రకటిత పోస్టులకు రిక్రూట్‌మెంట్ నిర్వహించాల్సి ఉన్నట్లు సమాచారం. ఆర్‌డి కార్యాలయం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రిక్రూట్‌మెంట్ నిబంధనల్ని బేఖాతర్ చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 31తో నోటి ఫికేషన్ కాలపరిమితి ముగిసిపోయింది. నోటిఫికేషన్ నిబంధనల్ని బేఖాతర్ చేస్తూ కాలపరిమితి ముగిసినప్పటికీ స్టాఫ్‌నర్స్ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించడంలోని ఆంతర్యం ఏమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నోటిఫికేషన్ నిబంధనల్ని పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు ప్రాంతాన్ని పరిశీలించిన డిఆర్ఎం

పట్టాలు తప్పిన ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఆర్ఎం మనీష్ అగర్వాల్

ప్రజాశక్తి-కడప

కడప రైల్వేస్టేషన్ సమీపంలోని భాకరాపేట వద్ద మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ప్రాంతాన్ని, గూడ్స్ బ్రేక్ వ్యాన్, డెమో ప్రాంతాలను గురువారం గుంతకల్ డిఆర్ఎం మనీష్ అగర్వాల్ సందర్శించారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను ఆయన తనిఖీ చేశారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్ విద్యుత్ కార్యాలయాన్ని, అధికారుల విశ్రాంతి గృహాన్ని, రైల్వే గూడ్స్ ఆఫీసును తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీనియర్ డిఒఎం జి.శ్రావణ్ కుమార్, సీనియర్ డిఇఎన్(కో-ఆర్డినేషన్) అక్కిరెడ్డి, సీనియర్ డిఇఎన్ (సౌత్) అభిరామ్, ఎడిఇ ఎన్.రాధాకృష్ణ, ఎఎస్‌టిఇ కాత్య కుమార్, ఎస్ఎంఆర్‌డి ఎన్‌రెడ్డి, సిసిఐ ఎ.జనార్ధన్, సీనియర్ డిఎస్‌టిఇ వై.పి..సింగ్ ఉన్నారు.

మేనేజర్ సహా ఆరుగురిపై సస్పెన్షన్ ఎత్తివేత

కడప రైల్వేస్టేషన్ సమీపంలోని భాకరాపేట వద్ద ఈ నెల 5వ తేదీ గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటనకు సంబంధించి కడప రైల్వేస్టేషన్ మేనేజర్ డి.నరసింహారెడ్డిరెడ్డితో సహా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ లాల్ బాబుసింగ్, సీనియర్ జిటిఎం ఖాసీం, పాయింట్స్‌మెన్ జ్యోతి ప్రతాప్, పాయింట్స్ ఉమెన్ శాంతిని బుధవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అదేరోజు వారిపై విధించిన సస్పెన్షన్‌ను రాత్రి ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. భాకరాపేట వద్ద చోటు చేసుకున్న ఘటనపై విచారణ నిమిత్తం కమిటీని వేసినట్లు తెలుస్తోంది. కమిటీ విచారణలో దోషులుగా తేలిన వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

జనం గుండెల్లో ఎల్ఐసికి సుస్థిర స్థానం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న విసి ఆచార్య చింతా సుధాకర్

జనం గుండెల్లో ఎల్ఐసి సుస్థిర స్థానం ఏర్పరచుకుందని వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. గురువారం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయ సభాభవనంలో ఎస్‌డి ఎం కె.గిరిధర్ అధ్యక్షతన బీమా వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ ఎల్ఐసి ఒక కార్పొరేట్ సంస్థగా అందించిన సామాజిక సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు పొందిందన్నారు. వ్యాపార కార్యకలాపాలు, క్లెయిముల చెల్లింపు, సామూహిక బీమా పథకాల నిర్వహణలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఎల్ఐసి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా అందిస్తున్న సేవల కారణంగా, ఆధునిక యువతరం మన్ననలు కూడా పొందుతోందన్నారు. 67వ బీమా వారోత్సవాల సందర్భంగా ఆయన ఎల్ఐసి పాలసీదారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్‌డిఎం మాట్లాడుతూ ఎల్ఐసి భారతదేశంతో పాటు 14 విదేశాల్లో కూడా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. మార్కెటింగ్ మేనేజర్ శ్యామసుందర్‌రావు మాట్లాడుతూ బీమా వారోత్సవాల సమీక్ష చేశారు. వారోత్సవాల సందర్భంగా ఉద్యోగులకు, మహిళలకు, విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలైన సిబ్బందికి, గాంధీనగర్ హై స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముగింపు సభలో ఆహుతులకు మేనేజర్ సేల్స్ శ్రీనివాస్ స్వాగతం పలుకుతూ, రఘునాథరెడ్డి వందన సమర్పణ చేశారు. ముగింపు సభకు ముందు, ఎల్ఐసి ఆవరణలో వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ మొక్క నాటారు. కార్యక్రమంలో మేనేజర్లు సత్య శ్రీనివాస్, సత్య ప్రసాద్, ఆనందరావు, రాము నాయక్, ఎల్లారెడ్డి, స్వరూప పాల్, గురు రాజ్, పిఆర్సి కుమార్, అధికారులు వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'రాచమల్లు' కుమార్తెకు ఆదర్శ వివాహం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :

కుమార్తెకు ఆదర్శ వివాహం జరిపిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ప్రథమ కుమార్తె పల్లవి ప్రేమించిన వ్యక్తితో గురువారం వివాహం జరిపించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పవన్ కుమార్‌ను తన కుమార్తె ప్రేమించిందని తెలుసుకొని అతని తల్లిదండ్రులతో చర్చించి గురు వారం ఉదయం బొల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వివాహం చేశారు. అనంతరం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని కుమార్తె వివాహాన్ని రిజిస్టర్ చేయించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఇద్దరు కుమార్తెల్లో ప్రథమ కుమార్తె వివాహాన్ని అత్యంత నిరాడంబరంగా జరిపించామని పేర్కొన్నారు. ఆమె ప్రేమించిన అబ్బాయితోనే వివాహం జరిపించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తన కుమార్తె చదువుకుంటున్న సమయంలో ఒక అబ్బాయిని ప్రేమిస్తే వారి స్థాయి, కుల మతాలు చూడకుండా తన కుమార్తె తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తూ వారిద్దరికీ వివాహం జరిపిం చామన్నారు. ప్రతి పిల్లల తల్లిదండ్రులు పిల్లల మనసెరిగి ఎక్కడైతే వారు సంతోషంగా జీవిస్తారో తెలుసుకొని పిల్లలకు తగినట్లుగా నడుచుకోవాలని తల్లిదండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు కాకర్ల నాగశేషారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి , ఎమ్మెల్యే రాచమల్లు కుటుంబ సభ్యులు కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బిజెపి దుర్మార్గ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి : పిసిసి

ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప : కేంద్రంలోని నరేంద్ర మోడీ దుర్మార్గ, దుష్ట పాలనకు ప్రజలు అంతం పలికే రోజులు దగ్గరపడ్డాయని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సంవత్సరం పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఎర్రముక్కపల్లి సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. అక్కడ నిర్వహించిన బహిరంగ సభను ఉద్దేశించి తులసి రెడ్డి మాట్లాడారు. రాహుల్ గాంధీ 2022 సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జూడో యాత్రకు దేశ ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, ఏఐసీసీ సభ్యులు బండి జకరయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్, ఆర్ టి ఐ రాష్ట్ర చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, వైస్ చైర్మన్ అమిర్ భాష, కాంగ్రెస్ పార్టీ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, రాష్ట్ర నాయకులు మహమ్మద్ అలీ ఖాన్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మధు రెడ్డి, చీకటి చార్లెస్, గుండ్లకుంట శ్రీరాములు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ తిరుమలేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ప్రసాద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు, మహిళా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చల్లా బాబును పరామర్శించిన 'వాసు'

ప్రజాశక్తి - కడప అర్బన్

చల్లా బాబును పరామర్శించడానికి వెళుతున్న వాసు, జగన్‌మోహన్‌రాజు

పుంగనూరు అల్లర్ల ఘటనలో కడప జైలులో రిమాండ్‌లో ఉన్న పుంగనూరు టిడిపి ఇన్‌ఛార్జీ చల్లా బాబును టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి (వాసు) పరామర్శించారు. గురువారం కడప కేంద్ర కారాగారానికి చేరుకుని చల్లా బాబుతో పాటు వారి కుటుంబ సభ్యులతో వాసు మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వాసు మీడియాతో మాట్లాడుతూ అక్రమ కేసులు ఎన్నటికీ నిలబడవని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం టిడిపి నాయకులపై కేసులు పెట్టి వేధిస్తుందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే కేసుల నుంచి విముక్తి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట టిడిపి నాయకులు జగన్‌మోహన్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

కడప అర్బన్ : నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ పరిశీలించారు. గురువారం నగరంలోని భగత్ సింగ్ పార్కు, ఫుడ్ ప్లాజా ప్రాంతాలలో పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊటుకూరు బ్రిడ్జి కింద ఉన్న పార్కు కొరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పార్కింగ్ ఏర్పాటుకు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

నూతన పథకాలపై ఖాతాదారులకు అవగాహన

ప్రజాశక్తి- కడప అర్బన్

ఖాతాదారుడికి మెగా చెక్కును అందజేస్తున్న అధికారి భాస్కర్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో గురువారం ఖాతాదారులకు బ్యాంకు నూతన పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కార్యాలయ అధికారి భాస్కర్ మాట్లా డుతూ పొదుపు ఖాతా సమృద్ధి పథకం ద్వారా మహిళలకు రూ. 5 లక్షల వరకు, కొన్ని రకాల కేన్సర్ చికిత్స నిమిత్తం రూ.9 లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉందని పేర్కొన్నారు. సమ్మన్ అనే పొదుపు ఖాతా ద్వారా పెన్షనర్స్‌కు రూ .లక్షల నుంచి రూ.55 లక్షల వరకు ప్రమాద బీమా అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు యూనియన్ బ్యాంకు నారీ శక్తి అనే పథకం ద్వారా రూ .2 లక్షల నుంచి రూ. 10 కోట్ల వరకు తక్కువ వడ్డీతో రుణాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం ద్వారా రూ 2 కోట్ల వరకు ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు తీసుకోమని తెలిపారు. గృహ రుణం అతి తక్కువ వడ్డీ కేవలం 8.40 శాతం, వాహన రుణం 8.85 శాతంతో ప్రస్తుతం ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేశారని పేర్కొన్నారు. విద్య రుణాలను అతి తక్కువ వడ్డీ, బ్యాంకు గుర్తించిన కొన్ని విద్యా సంస్థల లో సీటు పొందిన విద్యార్థులకు రూ.40 లక్షల వరకు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా అందిస్తున్నామని తెలిపారు ఈ అవకాశాన్ని ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ అధికారి సుధాకర్, రీజినల్ ఆఫీస్ సిబ్బంది,కడప అన్ని శాఖల మేనేజర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు

చురుగ్గా 3వ దశ రీసర్వే పనులు : కలెక్టర్

కడప : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వే పనులను జిల్లాలో 3వ దశలో కూడా చురుగ్గా చేపడుతున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి రాష్ట్ర భూ పరిపాలనా శాఖ కమిషనర్ సాయిప్రసాద్ సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి 'జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష' పథకం అమలు, రీ సర్వేలో భాగంగా స్టోన్స్ ప్లాంటేషన్, గ్రౌండ్ టూథింగ్ మొదలైన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజుతో పాటు జెసి గణేష్ కుమార్, డిఆర్వో గంగాధర గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి ల్యాండ్ సర్వే శాఖ ఇడి మురళీకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

12 నుంచి మండల స్థాయి క్రీడలు

కలసపాడు : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 12, 13వ తేదీల్లో అండర్ -14 కింద మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సీ మాలిని తెలిపారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పిఇటిల సమావేశంలో ఆమె పాల్గొని మాటాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలలోనూ మంచిగా రాణించాలని, అందుకు పిఇటిలు శక్తివంచన లేకుండా పనిచేయాలని తెలిపారు. చదువుతోపాటు మానసికల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని చెప్పారు. మండల స్థాయి క్రీడా పోటీలలో ప్రతి ఒక్క పాఠశాల నుంచి విద్యార్థులు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించాలని అన్నారు. గెలుపొందిన టీములు జోనల్ స్థాయిలో ఆడుతారని చెప్పారు.

నేడు క్విజ్ పోటీలు

కడప అర్బన్ : ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు వైద్య, విద్య అధికారులు డాక్టర్ నాగరాజు, రాఘవరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మండల, డివిజన్ స్థాయిలో విజేతలైన హైస్కూల్ విద్యార్థులకు మాత్రమే పోటీలుంటాయని తెలిపారు. ఈ నెల 8న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల (మెయిన్)కడపలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కావాల్సి తెలిపారు. విజేతలకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. సొంత బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారని తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - కలసపాడు

స్థానిక సెయింట్ అంటోనీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలను పాఠశాలలో ప్రిన్సిపల్ చిత్తా ప్రభావతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిత్తా, రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీకృష్ణుని జన్మదినం గురించి , చిన్నతనంలో ఆయన చేసిన చిలిపి చేష్టల గురించి, విద్యార్థిని విద్యార్థులకు విశదీకరింపజేశారు. యాదవ వంశ కులానికి చెందిన శ్రీకృష్ణుని చరిత్ర గురించి, యశోదమ్మ పడిన బాధల గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుని వేషధారణలో, ఉట్టి కొట్టి పలువురిని ఆనందింప చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రభా వతి, శేఖర్‌రెడ్డి, పిఇటిలు, తెలుగుభాష పండితులు పాల్గొన్నారు.

విఆర్ఎను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మండలంలోని కొలుములపల్లి పంచాయతీ విఆర్ఎ కె.వెంకటసుబ్బయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల వ్యవసాయాధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పలుకుబడి, బంధుప్రీతి ఉన్న వారికే ఈ క్రాఫ్ చేస్తున్నారని, పంట వేసిన ప్రతి రైతుకూ ఈ క్రాప్ చేయాలని పేర్కొన్నారు. రెగ్యులర్ ఆర్‌బికె అధికారి నియమించాలని కోరారు. తాడిగొట్ల ఆర్‌బికె అధికారిని ఈ క్రాప్ చేయాలని కొలుమూలపల్లె ఆర్‌బికెకు పంపారని, అక్కడ ఆయన గ్రామాలలో ఉన్న రైతులకు అందరికీ తెలియజేయకుండా బంధుప్రీతి, రాజకీయ పలుకుబడి ఉన్న వారికి మాత్రమే తెలియజేసి లబ్ధి చేకూర్చాలనుకోవడం శోచనీయమన్నారు. గ్రామంలోపంట వేసిన ప్రతి రైతుకూ తెలియజేయాలని ఆయన కోరారు. విధులు సక్రమంచి నిర్వహించని కె వెంకటసుబ్బయ్యపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వెయ్యి మందికి రక్తదానం

పోరుమామిళ్ల టౌన్ : రైట్ హ్యాండ్ ఆర్గనైజేషన్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రెండేళ్ల కాలంలో ఆపదలో ఉన్న వెయ్యి మంది రోగులకు, గర్భిణులకు రక్తదానం చేయించామని వ్యవస్థాపకులు నాయబ్ రసూల్, పురం ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్ల గిరి నగర్ కాలనీకి చెందిన మమతకు సుందరయ్య కాలనీకి చెందిన రమణచే వెయ్యివ రక్తదానం చేయించారు. ఒక చిన్న లక్ష్యం కోసం రక్త దాతల గ్రూపు ఏర్పరచుకొని రక్తదాన కార్యక్రమాలు నిర్వహించడం తమ ఫౌండేషన్ సభ్యులందరికీ ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు.

గ్రూప్-2 పోస్టుల సంఖ్య పెంచాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-2 పోస్టుల సంఖ్యను పెంచాలని డివైఎఫ్ఐ వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. 500 ఉద్యోగాలు నిరుద్యోగులకు ఏమాత్రం సరిపోవన్నారు. గురువారం స్థానిక అర్అండ్బి అతిధిగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాను చేస్తున్న పాదయాత్రలో ఊరూరా తిరుగుతూ నిరుద్యోగ యువతకు తాను అధికారంలోకి వస్తే ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఒక్క జాబ్ క్యాలెండర్ను కూడా విడుదల చేయలేదన్నారు. ఇటీవల క్యాబినెట్లో గ్రూప్2 పోస్టులు వెయ్యి భర్తీ చేస్తున్నామని ప్రకటించి, తీరా 500 మాత్రమే వదలడం యువతను మోసం చేశారన్నారు. సమావేశంలో నాయకులు రాఘవ, సూరి, సుభాష్, ఉదయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరగాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్కౌట్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరగాలని ఎంఇఒ సావిత్రమ్మ తెలిపారు. స్థానిక రూరల్ పరిధిలోని తాళ్లమాపురం జడ్పీ హైస్కూల్లో గురువారం నేతాజీ స్కౌట్ గ్రూప్ను ప్రధాన ఉపాధ్యాయుడు వై.గోపీనాథ్రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి ఎన్. జగదీశ్వర్రెడ్డి 30 మంది విద్యార్థులకు స్కౌట్ యూనిఫాం వితరణ చేయడం హర్షణీయమన్నారు. యూనిఫాంను దాత తల్లిదండ్రులు చంద్రశేఖర్రెడ్డి, వెంకటలక్ష్మి విద్యార్థులకు అందజేశారు. పాఠశాల స్పోర్ట్ మాస్టర్ సుబ్బానాయుడు మాట్లాడుతూ సమాజం క్రమశిక్షణను పెంపొందించడానికి బెడెన్ పౌల్ స్కౌట్ను స్థాపించారన్నారు. మనమందరం కలిసి సమాజంలో రుగ్మతలను తొలగించాలని, మానసిక వ్యధలను దూరం చేయాలని కోరారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకర్ మాట్లాడుతూ క్రమశిక్షణ ద్వారా మెరుగైన సమాజాన్ని, తద్వారా ఆనందమయ జీవితాన్ని సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేతాజీ స్కౌట్ గ్రూప్ విద్యార్థులతో ఎంఇఒ, ఉపాధ్యాయులు

శ్రీనివాసరెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డికి గురువారం మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు కడపలో ఆయన స్వగృహంలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాసరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు తుట్టే రాము యాదవ్, బిసి సాధికార సమితి నాయకులు గోవింద్, సుబ్బయ్య, ప్రభాకర్ రాజు, రామకృష్ణ నాయుడు, దాసరి దిలీప్ తేజ యాదవ్, శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.

గాయపడిన మిత్రుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మండలం గొల్లపల్లె గ్రామానికి చెందిన దండు నాగమునెయ్య గత నెలలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్లోని ఓ ప్రయివేట్ హాస్పిటల్కు తరలించారు. అక్కడి వైద్యులు తలకు ఆపరేషన్ చేశారు. మునెయ్య ఆర్థిక పరిస్థితి గురించి తెలిసిన తనతోపాటుగా చదుకున్న తోటి మిత్రులు రూ.15వేలు నగదు, ఒక బియ్యం బస్తా సాయం చేశారు. కార్యక్రమంలో గురుమోహన్, అబ్దుల్, బిసిఆర్ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతుడికీ..

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక ఎపి మదర్ థెరిస్సా విభిన్న ప్రతిభావంతుల సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీనివాస్ నగర్లో నివాసం ఉంటున్న షేక్ మహబూబ్ అనే విభిన్నప్రతిభావండుతికి రు.5000 ఆర్థికసాయం అందజేశారు. దాతలు ఎవరైనా సాయం చేయాలని కోరారు. కార్య క్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్, ఎస్ఎం బాషా, అల్తాఫ్ పాల్గొన్నారు.

రెడ్డి ఆత్మీయ సమ్మేళన పత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రెడ్ల ఆత్మీయ సమ్మేళన ఆహ్వాన పత్రికలను గురువారం మున్సిపల్ వైసిపి ఇన్ఛార్జి వైఎస్ మనోహర్రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్రెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 24న ఆదివారం కడప రోడ్డులోని చందమామ డాబా వద్ద ఉన్న ఎస్ఎన్బి కళ్యాణ మండపంలో రెడ్ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ రాష్ట్ర అధ్యక్షులు సురేంద్రరెడ్డి తెలిపారు. రెడ్ల ఐక్యత కోసం ఈ సభను ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా ఎంపీ అవినాష్రెడ్డి, వైయస్ అభిషేక్రెడ్డి, రాయలసీమ యూత్ కన్వీనర్ జగదీశ్వర్రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామలింగారెడ్డి, రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలోని రెడ్లు అందరూ ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీరారెడ్డి, పద్మనాభరెడ్డి, కడియాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, సిద్దయ్య లక్ష్మీనారాయణరెడ్డి, పాపయ్య పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- చెన్నకృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం : వైసిపి

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండలంలోని కొత్తరాజువారిపేట వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కుచ్చుపాపకు చెందిన చెన్నకృష్ణ (40) మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చెన్నకృష్ణ మృతదేహం వద్ద ఆస్పత్రిలో గురువారం వైసిపి మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగు మందుల దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న చెన్నకృష్ణ రోడ్డు ప్రమాదంలో చనిపోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి టి,లక్షుమయ్య, దువ్వూరు ఎంపిపి జయ చంద్రారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నకృష్ణ మృతదేహం వద్ద వైసిపి నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంపీ

గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఓఎస్డి, నాయకులు

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కల్లూరుపల్లెలో గురువారం ఆయన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా వైఎస్ అవినాష్రెడ్డి, ఓఎస్డి అనిల్ కుమార్రెడ్డి, మండల ఇన్ఛార్జి వైఎస్ కొండారెడ్డి పాల్గొన్నారు. వారికి బ్యాండ్ మేళాలు, పూలమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆ గ్రామంలో ఉన్న సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఏ గ్రామంలో ఉన్న సమస్యలు ఆ గ్రామ సచివాలయంలో పరిష్కారం కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి భావించారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మాధవీబాలకృష్ణ, ఎంపిడిఒ శివారెడ్డి, తహశీల్దార్ రాజసింహ నరేంద్ర, మాజీ ఉప మండలాధ్యక్షులు సభాపతి నాయుడు, గండి దేవస్థానం సభ్యులు రామాంజుల్ రెడ్డి, కల్లూరుపల్లె సర్పంచు పురుషోత్తం నాయక్, మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ప్రజా సంక్షేమ రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి మున్సిపల్ ఇన్ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప తెలిపారు. పట్టణ పరిధిలోని రోటరీపురం, జండామాను వీధిలో గురువారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే అధికారులు, నాయకులు ప్రతి ఇంటికి వెళుతున్నారన్నారు. నాయకులు, అధికారులు ప్రతి ఇంటికెళ్లానే ఉద్దేశ్యంతో సిఎం జగన్ మోహన్రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్రెడ్డి, కౌన్సిలర్లు కిషోర్, రమణ, ఖాదర్బాషా, రజియా, చంద్రమౌళి పాల్గొన్నారు.

లబ్ధి చేకూర్చే పత్రాలు అందిస్తున్న వైసిపి నాయకులు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులతో ఎపి ఎడారే

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణానది ఎగువ ప్రాంతంలో ఉన్న తెలంగాణ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తి చేస్తే ఆంధ్రప్రదేశ్ ఎడారి అవుతుందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం శ్రీశైలం రిజర్వాయర్ ఆధారంగా ఏడాదికి 90 టిఎంసి జలాలు మళ్లించేలా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీని అంచన విలువ రూ.52,000 కోట్లుతో 12-38 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లిఫ్టులు, 5 జలాశయాలు ఉన్నాయన్నారు. ఈ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. మొత్తం ప్రాజెక్టుల్లో 52 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. సెప్టెంబర్ 16న శ్రీశైలం రిజర్వాయర్ నార్లపూర్ జలాశయానికి నీళ్లు ఎత్తిపోసే కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభిస్తోందన్నారు. ఈ ప్రాజెక్టుకు బచావత్ ట్రిబ్యునల్ గాని, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్గాని నీటిని కేటాయించలేదని తెలిపారు. కేంద్ర జలసంఘం, కృష్ణ బోర్డు, అపెక్స్ కౌన్సిలర్కాని అనుమతులు ఇవ్వలేదన్నారు. విభజన చట్టంలో ఈ ప్రాజెక్టుల ప్రస్తావన లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజెట్ నోటిఫికేషన్లో ఈ ప్రాజెక్టు అనుమతులు లేని జాబితాలో ఉందన్నారు. అయినా అక్రమంగా తెలంగాణ ప్రభుత్వం దౌర్జన్యంగా ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు తులసిరెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రప్రదేశ్లో కృష్ణానది ఆధారంగా నిర్మితమైన తెలుగుగంగ, గాలేరి-నగరి, హంద్రీనీవా, వెలిగొండ, ఎస్ఆర్బిసి, నాగార్జున సాగర్, కృష్ణా డెల్టా కింద 50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందదని తెలిపారు. భూములు బీడుగా మారుతాయని తెలిపారు. తాగునీట సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. పరిశ్రమలకు, జల విద్యుత్కు నీరు ఉండదని చెప్పారు. ఇంత ప్రమాదం జరుగుతుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి నోరు తెరవకపోవడం శోచనీయమన్నారు. వెంటనే వైసిపి ప్రభుత్వం రంగంలోకి దిగి చట్ట ప్రకారం అడ్డుకోవాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

తాడిపత్రి రోడ్డు మార్గంలో బ్రిడ్జి వద్ద, మోరగుడి, దొమ్మర నంద్యాల మార్గ మధ్యలో రోడ్డంతా ధ్వంసమైందని, వెంటనే మరమ్మతులు చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శి దాసు, దాసరి విజయ్ కోరారు. ఆ మేరకు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్బి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. మోరగుడి, దొమ్మర నంద్యాల మార్గంలో ఆటోలు, బైకులు, అనేక పెద్దపెద్ద వాహనాలు వందల సంఖ్యలో తిరుగుతూ ఉన్నాయన్నారు. ఆర్అండ్బి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టకపోవడంతో సిఐటియు తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో కార్యాలయం ముందు నిరసన చేయాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరేంద్ర, నన్నే, దివాకర్, స్వామి పాల్గొన్నారు.

నిరసన అనంతరం ఆర్అండ్బి సిబ్బందికి వినతిపత్రమిస్తున్న సిఐటియు నాయకులు

రైల్వే బ్రిడ్జిని పరిశీలించిన డిఆర్ఎం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వే గేటు సమీపంలో జరుగుతున్న రైల్వే బ్రిడ్జి మరమ్మతుల పనులను గురువారం గుంతకల్లు డివిజన్ డిఆర్ఎం మనీష్ అగర్వాల్ పరిశీలించారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జిలు నిర్మించి వందేళ్లు పూర్తి కావడంతో మరమ్మతులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇనుముతో ఏర్పాటు చేసిన బ్రిడ్జిలు తొలగించి సిమెంట్ స్లాబ్ ఏర్పాటు చేశారు. ఆదివారం వరకు పనులు జరుగుతాయని రైల్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిఇ అభిరామ్, ఎఇ రాధాకృష్ణయ్య, సెక్షన్ ఇంజినీర్ సుల్తాన్బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

చిన్న పిల్లలు, గర్భిణులకు పోషకాహార ప్రాధాన్యతను తెలిపేలా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని పలు అంగన్వాడీ సెంటర్లు, బాలాజీ పాఠశాలలో పోషకాహార ప్రాధాన్యతను పిల్లలకు, తల్లులకు వివరించారు. సమయానుకూలంగా ఆహారం తీసుకోవాలన్నారు. పోషకాహారాన్ని తీసుకొని చిన్నారుల భవిష్యత్తును కాపాడాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి వీరాంజనేయ స్వామి నిత్య అన్నదానం చేయుటకు పలువురు రూ.1,50,116 విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి, చైర్మన్ పినుబోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. దువ్వూరు మండలం భీమునిపాడు వాస్తవ్యులు బికెర్ కన్స్ట్రక్షన్ అధినేత కుప్పన్నగారి రామాంజనేయరెడ్డి, వారి ధర్మపత్ని శారద వారి తండ్రి కీర్తిశేషులు సంజీవరెడ్డి జ్ఞాపకార్థం లక్ష 116 రూపాయలు, తమిళనాడు రాష్ట్రం ఈ రోడ్డు వాస్తవ్యులు శ్రీహంచాటి లక్ష్మీనారాయణ రావు సతీమణి గీతభాయ్ రూ.50వేలు విరాళం ఇచ్చినట్లు వారు తెలిపారు. విరాళాలు అందించిన ఇరువురి కుటుంబాలకు అంజన్న సన్నిధిలో వారి కుటుంబ సభ్యుల పేరుతో ప్రధాన అర్చకుడు కేసరి స్వామి రాజా స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేశారు.

నిర్దేశించిన స్థలంలోనే వాహనాలు ఆపాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రావణ శనివారాలు పురస్కరించుకుని వాహనాల్లో వచ్చే భక్తులకు నిర్దేశించిన స్థలాల్లోనే వాహనాలు నిలపాలని ఆర్కె వ్యాలీ సిఐ గోవిందరెడ్డి సూచించారు. గండి దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్న సందర్భంగా వేంపల్లి వైపు నుండి వచ్చే వాహనాలు ఇడపలపాయి(వీరన్న గట్టుపల్లె) క్రాస్ వద్ద, రాయచోటి వైపు నుంచి వచ్చే వాహనాలు అద్దాలమర్రి కాసు వద్ద ఆపాలని సూచించారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించి ప్రత్యామ్నాయ దారులు చూసుకోవాలని సిఐ సూచించారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రాభివృద్ధి టిడిపి పాలనలోనే సాధ్యమని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముత్తుకూరు గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి మద్దతు ఇవ్వాలని రఘునాథ్రెడ్డి ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మైనార్టీ నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, బాలస్వామిరెడ్డి, ముత్తుకూరు గంగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, రామగంగిరెడ్డి, ఆర్వి రమేష్, శేషారెడ్డి, డక్కా రమేష్, జబిబుల్లా, మారుతి, మల్లికార్జున, మహమ్మద్ ఇనాయతుల్లా, యుగంధర్తో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బొలిశెట్టి రాముకు డాక్టరేట్

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జెయుకెటి పరిధిలోని ఇడుపుల పాయ ట్రిపుల్ఐటిలో రసాయన శాస్త్ర విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న బొలిశెట్టి రాముకు ఎస్కె యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎస్కె యూనివర్శిటీ రసాయన శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ సుధాకర్బాబు పర్య వేక్షణలో సింథసిస్ క్యారెక్టరైజేషన్ అండ్ బయో లాజికల్ ఎవల్యూయేషన్ ఆఫ్ న్యూ స్కిప్ బేస్ మెటల్-కాంప్లెక్స్' అనే అంశంపై థీసిస్ను సమర్పించినందుకు పట్టా ప్రదానం చేసింది. తమ అధ్యాపకుడికి డాక్టరేట్ రావడంపై ట్రిపుల్ఐటీ డైరెక్టర్ సంధ్యారాణితోపాటు ఎఒ, డీన్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు డిగ్రీ కళాశాల విద్యార్థులు

వేంపల్లె : స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. వారిని గురువారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ అభినందించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర మాట్లాడుతూ మహిళల విభాగంలో వర్ష, మౌనిక నవనీత, పురుషుల విభాగంలో వం ు రళీ వె ా వా ౦ న్, మునాఫ్, సిద్దిక్, సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా నుండి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

IN THE COURT OF THE PRL.SENIOR CIVIL JUDGE: KADAPA

I.A.No.90/23 in O.S.No.61/21
And
I.A.No. 91/23 in I.A.No.395/21 in O.S.No.61/21

1. లేవాకు విజయప్రతాప్రెడ్డి.
2. సానపురెడ్డి జగదీశ్వరరెడ్డి

...పిటీషనర్లు/వాదులు

Vs

శిరిగిరెడ్డి సుధాకర్రెడ్డి, తండ్రి వీరారెడ్డి, ఇంటి నెం.6/799, నమస్తేబోర్డు లైను, శంకరాపురం, చిన్నచౌకు, కడప సిటీ & జిల్లా.

...రెస్పాండెంటు/ప్రతివాది

//By Order of the Court//

రెస్పాండెంటుకు/ ప్రతివాదికి నోటీసు

పై వాదులు మీ పైన వేసిన పై కేసులోని మరియు ఇంజక్షన్ పిటీషన్లోని షెడ్యూలులో తెల్పిన రెండవ సర్వే నెంబరు 738/1కి బదులు పొరపాటుగా 738/36ని టైపు చేయడం జరిగినందున, సదరు పొరపాటును సవరణ చేయవలసినదిగా వేసిన I.A.No.90/23 in O.S.No.61/21 మరియుI.A.No.91/23 in I.A.No.395/21 in O.S.No. 61/21 రెండు పిటిషన్లు మీరు హాజరగుటకు గాను తేది: 21-9-23న వాయిదా వున్నది. పై కోర్టులో సదరు తేదీన ఉ.10.30 గం॥లకు మీరు ఖుద్దున గాని వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఎన్.రవీంద్రనాథ రెడ్డి
పిటీషనర్ పరం న్యాయవాది, కడప.

YERRAGUNTLA NAGARA PANCHAYAT

'e' Procurement Tender Notice No.03/E1/2023-24(3rd Call) to 08/E1/2023-24(4th Call) , 10/E1/2023-24(1st Call) to 16/E1/2023-24 (1st Call) Dt: 7.9.2023.(Short Tender)

GGMP (Gadapa Gadapaku Mana Prabhutvam) - 2022-23 (08 works) & General Fund 2023-24 (One Work).

Est.Cost (9 no.of works) : 60.50 Lakhs
Bid Document Downloading Start Time : 08.09.2023 @ 10.00 AM.
Bid document downloading end date : 14.09.2023 @ 4.00 PM.
Last date/Time of receipt of Tender : 14.09.2023 @ 5.00 PM.
Contact: Commissioner, Yerraguntla Nagara Panchayat - 9000103129.
Further details can be seen @'e'Procurement market place @ https://tender.apeprocurement.gov.in
Assistant Engineer, Contact No.8179056290.
Deputy Executive Engineer, Contact No. 7386141097.

Sd/- Commissioner,
Yerraguntla Nagara Panchayat

శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని పట్టణంలో ఉన్న శ్రీకృష్ణ ఆలయాన్ని వైజాగ్ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, మరో ఎమ్మెల్సీ ఆర్రమేష్ యాదవ్, కొత్తపల్లి పంచాయతీ సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి గురువారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్ మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి యాదవులకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణ ఆలయ, గోశాల అభివృద్ధికి ఎల్లవేళలా తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్రెడ్డితో తాను ఎమ్మెల్సీ వంశీ త్వరలో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, కొత్తపల్లి 13వ వార్డు మెంబర్ కొనిరెడ్డి హర్షవర్ధన్రెడ్డి, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

లోకేష్ పాదయాత్రపై దాడి అమానుషం

- టిడిపి ఇన్ఛార్జి భూపేష్రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్, ఆయన వాలంటీర్లపై దాడి చేయడం హేయమైన చర్య అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి చదిపిరాళ్ల భూపేష్రెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీమవరంలో లోకేష్ బాబు, యువగళం వాలంటీర్లపైచ జరిగిన రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న విధంగా వైసిపి శ్రేణులు ప్రవర్తించడం పిరికిపంద చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా నిరసనలు, ర్యాలీలు, పాదయాత్రలు శాంతియుతంగా చేసుకునే హక్కు ప్రతి పౌరుడికీ ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మీనారాయణ, అలీ, దేవిరెడ్డి గురురెడ్డి, జనార్దన్రెడ్డి, రామిరెడ్డి, రమణారెడ్డి, రాజశేఖర్రెడ్డి, సుబ్బరామిరెడ్డి, రామస్వామిరెడ్డి, గంగాధర్, చంద్రమోహన్, హరీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఖాజీపేట : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో వైసిపి కార్యకర్తలు భయానక వాతావరణం కల్పించి, బజార్ రౌడీల్లా ప్రవర్తించి, ప్రశాంతతకు మారు పేరైన పశ్చిమగోదావరి జిల్లాలో టిడిపి శ్రేణులను భయభ్రాంతులకు గురి చేయడం అమానుషమని టిడిపి రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఖండించారు. దుంపలగట్టు గ్రామంలోని ఆయన ఇంట్లో గురువారం రెడ్యం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత రెడ్యం చంద్రశేఖర్రెడ్డి, నాయకులు ఇండ్ల వెంకటరెడ్డి, రెడ్యం నాగేశ్వర్ రెడ్డి, మున్నెల్లి సుబ్బరాయుడు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

- డిఎంహెచ్ఒ నాగరాజు

ప్రజాశక్తి - ఖాజీపేట

సీజన్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ నాగరాజు సూచించారు. కొత్తపేట, చెమ్ముల్లపల్లె సచివాలయాలను గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.అయేషాసుల్తానా ఆధ్వర్యంలో డిఎంహెచ్ఒ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ ఎంఎల్హెచ్పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు తగు సూచనలిచ్చారు. అనంతరం ఆయన పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను ఉద్దేశించి వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను ఆయన వివరించారు. సి.కొత్తపేటలో డాక్టర్ వైఎస్ఆర్ క్లినిక్ను తనిఖీ చేసి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కొత్తపేటలో ఉన్నత పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎఎంఒ వెంకటరెడ్డి, జిల్లా ఆరోగ్య విస్తరణ అధికారి కెఎస్వి ప్రసాద్, మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, సూపర్వైజర్ శోభన్బాబు, హెల్త్ అసిస్టెంట్ డి.వెంకటేశ్వర్లు, ఎంఎల్హెచ్పి ఉమా, శిరీషా, ఎఎన్ఎంలు ఇంద్రామణి, సుజాత, మెహరున్నిషా, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, కాశీరత్నమ్మ, నాగేశ్వరీ, అంగన్వాడీ కార్యకర్తలు రుక్మిణి, నాగమణి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, చిన్నారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని జడ్పిటిసి రవికుమార్ రెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్రెడ్డి అన్నారు. గురువారం స్థానిక షాదీఖానాలో కొత్త పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సిఎం వైఎస్ జగన్ నిరంతరాయంగా అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం పాలనలో కొత్త పింఛన్ కోసం లబ్ధిదారులు పడి గాపులు కాచేవారని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో అర్హత కలిగిన వారందరికీ సకాలంలో ఆయా రకాల పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రనాథ్రెడ్డి, ఎపిఎం బాలస్వామి, ఇఒ సుబ్బారెడ్డి, కో- ఆప్షన్ అస్సానయ్య, హజ్ హౌస్ డైరెక్టర్ మునీర్, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ కొండయ్య, ఎంపిటిసిలు కటిక చంద్రశేఖర్, మణిగోపాల్ రెడ్డి, రాజ్కుమార్, హబిబుల్లా, భారతి, పఠాన్ రహంతుల్లా, వార్డు సభ్యులు లక్ష్మిదేవమ్మ, నరసింహగౌడ్, ముత్యాల అంజీ, గణేష్, సురేంద్ర, సునీల్, షామీర్, బికారి, బండల షకూర్, బాబయ్య, బాలరాజు, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

Union Bank of India (A Government of India Undertaking)
4/1294, నాలుగు రోడ్ల జంక్షన్, మార్కెట్ వద్ద, పోరుమామిళ్ల రోడ్డు, బద్వేల్, వైఎస్ఆర్ కడప జిల్లా-516227, ఎ.పి.
సంప్రదించాల్సిన నం.: 08569-284046,
ఇ మెయిల్ : ubin0807320@unionbankofindia.bank

స్వాధీనతా ప్రకటన

రూల్-8 (1) ఆఫ్ ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్, 2002-స్థాపక ఆస్తి కోసం]

అయితే, కింద సంతకం చేయబడినది యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బద్వేల్ బ్రాంచ్ (07321), కడప, సెక్యూరిటైజేషన్ కింద అధీకృత అధికారి మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 అమలు చేయడం మరియు సెక్షన్ 13(2) కింద అందించబడిన అధికారాలను అమలు చేయడం ద్వారా భద్రతా ఆసక్తి (అమలు) రూల్స్ 2002లోని రూల్ 3తో చదవండి, 03.03.2023 తేదీన డిమాండు నోటీసును జారీ చేసింది. రుణగ్రహీతలు (1) శ్రీమతి. కొట్టే పార్వతి, W/o సుబ్బరాయుడు, 30/123, అబ్బరతి వీధి, బద్వేల్, కడప-516227 మరియు (2) Mr. కొట్టే సుబ్బరాయుడు, S/o సుబ్బరాయుడు, 30/123, అబ్బరతి వీధి, బద్వేల్, కడప -516227 మరియు హామీదారు (3) శ్రీ మాలేపాటి సురేంద్ర కుమార్, S/o M. వెంకట సుబ్బారావు, 11/1/900, మెయిన్ బజార్, పోరుమమ్మిలరోడ్ , బద్వేల్, కడప- 516227, నోటీసులో పేర్కొన్న మొత్తం అంటే 5,74,600.80 (రూ. ఐదు లక్షల డెబ్బై నాలుగు వేల ఆరు వందల ఎనభై పైసలు మాత్రమే) మరియు ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు వడ్డీ & ఖర్చు . అదే రెండు వార్తాపత్రికలు (హన్స్ ఇండియా & ప్రజా శక్తి) డిటిలో కూడా ప్రచురించబడింది. 22/06/2023. రుణగ్రహీతలు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సెక్షన్ 13(4) కింద అతనికి/ఆమెకు అందించబడిన అధికారాలను ఉపయోగించి దిగువ సంతకం చేసిన వ్యక్తి ఇక్కడ వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీతలకు మరియు సాధారణంగా ప్రజలకు నోటీసు ఇవ్వబడింది.) ఈ 02/09/2023న సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్మెంట్ యొక్క 8వ నిబంధనతో చదవబడిన చట్టం) రూల్స్ 2002.

ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణంగా ప్రజలు ఆస్తితో వ్యవహరించవద్దని హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తికి సంబంధించిన ఏదైనా లావాదేవీలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బద్వేల్ బ్రాంచ్ యొక్క బాధ్యతకు లోబడి ఉంటాయి. బకాయిలకు చెల్లించిన మొత్తం, ఏదైనా ఉంటే, ఖాతాలో చివరి చెల్లింపు సమయంలో సర్దుబాటు చేయబడుతుంది. సురక్షితమైన ఆస్తిని రీడీమ్ చేయడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించారు.

సురక్షిత ఆస్తి యొక్క వివరణ 101.37 చ.మీ. ప్రకటన-కొలతతో శ్రీమతి కొట్టే పార్వతి పేరుతో ఉన్న భవనం ఉన్న నివాస స్థలం యొక్క మొత్తం భాగం మరియు పార్శిల్. యడ్స్. లేదా 2.09 సెంట్లు సై నెం. 1182/2B, డోర్ నెం. 2-2-630, బద్వేల్ విలేజ్ ఫీల్డ్, అబ్బరతి స్ట్రీట్, కడపలో ఉన్నాయి మరియు సరిహద్దులుగా:
తూర్పు: పూనగాని గంగులయ్య మరియు సింగంశెట్టి రమణయ్య, **పశ్చిమం:** గనుమంతు స్థలం బాలసుబ్బయ్య, **ఉత్తరం ద్వారా:** గనుమంతు శేషమ్మ, దాత, **దక్షిణం:** షేక్ అల్లాబకాష్..

తేది: 02.09.2023 **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : కడప. **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున**